# ఐ హేట్ యు!

నా ఖర్మకాలి భరతనాట్యం నేర్చుకున్న పిల్లను పెళ్లాడాను కాస్తంత కళాపోషణ చేసినట్టు వుంటుంది కదాని... పిల్ల ఎర్రగ బుర్రగా వుంది కదాని మేరేజికి 'ఎస్స'నేశాను!

తీరా పెళ్లి అయిన తర్వాత తెల్సింది, శ్రీమతి నా చేత భరత నాట్యం చేయించగల సమర్థురాలని!

హర్ష దృష్టి... ధ్యాస... ఎప్పుడూ నాట్య ప్రదర్శనల మీదే. ఇంటిని మొగుడిని పట్టించుకోదు.

ఎన్నో ప్రదర్శనలు ఇవ్వగలిగింది...! ఎన్నో సార్లు తనకు సన్మానాలు జరిగేయి... ఎన్నో బిరుదులు ఆమెకు ప్రదానం చేయటం సంభవించింది...ఎంత డబ్బు వెనకేయగలిగామన్నదే హర్ష ఆలోచన.

మొగుడనే వాడిని నేనొకడినున్నాననే వాస్తవాన్ని హర్ష మరిచిందనే నా అభిప్రాయం.

ఎడ్డెమంటే తెడ్డెమంటుంది. యస్సంటే..నో అంటుంది. హర్ష ఇంతటి ఘటికురాలని కలలోనైనా వూహించలేదు. ఈ విధమైన మనస్తత్వం హర్షకు వున్నదని పెళ్లి చూపులప్పుడే ఏ వక్కరైనా, నా చెవిలో వూది వుంటే.. ఛస్తే పెళ్లికి వప్పుకునుండేవాడినే కాదు.

'రాజేష్! నిన్ను మేరేజ్ చేసుకున్నాక నాకు అదృష్టం కలిసొచ్చింది. నిజం! నాట్య ప్రదర్శనలతో ఊపిరి సలపటం లేదనుకో... బిజీ ప్రోగ్రామ్స్‌తో విశ్రాంతి లేకుండా పోతోంది....'

'అట్లాగేం...? - నిన్ను చేసుకోబట్టే నా ఖర్మ ఇట్లా కాలింది. ఓ ముద్దు ఓ ముచ్చట లేకుండా పోయింది. నాకు లైఫ్ బోర్ కొడుతోంది... త్వరలో పిచ్చెక్కినా... నువ్ ఆశ్చర్య పోనక్కర్లేదు....' పేలవంగ నవ్వేను.

సరిగ్గా అప్పుడే బామ్మర్ది ఆంజనేయులు ఎంట్రీ ఇచ్చాడు.

'నీకిక్కడేం పని? నువ్వెందుకొచ్చేడిశావ్? విసుక్కున్నాను.

'ఓ నా పిచ్చి బావగారూ!... నేను హనుమంతుడి అంశలో పుట్టిన నామధేయుడిని కదా? ఏ కొమ్మమీద అయినా.. పిట్ట గోడమీద అయినా... ఎక్కడ పడితే అక్కడ వుంటాను. వుండగల శక్తి నాకుంది.. మా సిస్టర్‌కి ఒక్కగానొక్క తమ్ముడిని నేనే కదా!

అన్నాడు.

'ఆ విషయం నువ్ నొక్కినొక్కి చెప్పక్కర్లేదులే!..'

'నేను అక్క హర్షకు పి.ఏ.ను..కారు డ్రైవర్ని...వాట్ నాట్...? - 'కాలరెగరేశాడు ఆంజనేయులు.

'ఆపు నీ డాప్పురి మాటలు! నీ సపోర్ట్ చూచే హర్ష పేట్రేగిపోతోంది. ఇద్దరూ ఏకమై ఇల్లు పట్టకుండా టూర్ల మీద టూర్లు చేస్తున్నారు. కంటికి కన్పించకుండా పోతున్నారు. ఐ హేటిట్...' విసుక్కున్నాను.

'మీకసలు బొత్తిగా టేస్టనేదేలేదు బావగారూ! నేను చేస్తున్న పని నిజానికి మీరే చేయాలి!

'షటప్! అరలక్ష జీతం నెలకి తీసుకుంటున్న వాడిని, కంప్యూటర్ ఇంజనీర్ని... సొసైటీలో హోదా అంతస్తుకల వాడిని..ఇన్నీ వున్న నన్ను ఆఫ్టాల్ నీ సిస్టర్కి పి.ఏ.గా వ్యవహరించ మంటవా? - ఐ డోన్ట్ స్పేర్ యూ. నాలో సహనం సన్నగిల్లి కోపం తారా స్థాయికి చేరుకుంది.

బావ బావమరుదుల సంభాషణ వింటూన్న హర్ష ముసి ముసిగ నవ్వుకుంటూ మౌనం వహించింది!

'కోపగించుకోకండి బావాజీ!..డోన్టబి ఏమోషనల్! నరదాకు అన్నాను. దట్సాల్..అసలు మ అక్క టేలెంట్ చూచి ఆశపడేకదా పెళ్లాడారు...'

'అయితే..?'

'మా అక్క ఉజ్వల భవిష్యత్ కోసం మీరే మాత్రం చేయూతనిస్తున్నారు?... పోనీ సహాయపడుతున్నారు?... ఏమీ లేదు. పెద్దగుండుసున్నా! పోనీ అక్క ఇస్తున్న ఒక్క ప్రదర్శనైనా చూశారా? ఆనందించారా? లేదే?... మీవన్నీ బూటకపు మాటలు..?

'నీ ఉపన్యాసం కట్టి పెట్టవోయ్! - నా పెళ్లాం...నా ఇష్టం! నాట్య ప్రదర్శన ఇంట్లో ఇచ్చి నన్నానంద పరచాలిగానీ... ఎక్కడో ఎవరికోసమో ఇచ్చే ప్రదర్శనకు నేను ఛస్తే రాను. చూడను. - మీ అక్క స్టేజీలెక్కి తైతక్కలాడటం నేను హర్షించను.

'మా అక్క హర్ష బారన్ ఆర్టిస్ట్ సార్! క్రితం జన్మలో దేవేంద్ర లోకంలో ఏ మేనకో.. తిలోత్తమో అయివుంటుంది. మీ అదృష్టం కొద్దీ ఈ జన్మలో మీ పాలిట పడి... మీకు పెళ్లామైంది... మా అక్క కొచ్చే ప్రశంసలు చూచి మీరు ఓర్వలేకపోతున్నారు. హర్షక్కను చూస్తే మీకు జలసీ..కదూ?'

'షటప్ అతిగా వాక్కు!

'కాకపోతే ఏంటి? మా అక్కకున్న పాపులారిటీ మీకేది? మీ కొచ్చే ఆరునెల్ల జీతం అక్క ఒక్క ప్రదర్శన ఇచ్చి సంపాదిస్తుంది...'

'మళ్లీ షటప్!...

'ఎమోషనవకండి. మీ ఆరోగ్యం దెబ్బతింటుంది. మా తమ్ముడు మాట్లాడుతున్న విషయంలో తప్పేమైనా వుందా? - ఉన్నదేగా అన్నాడు.. హర్ష కలుగ చేసుకుంది.

'ఏమిటే అవుతున్నది? - నీ తోటి వారంతా సుఖంగా సంసారం చేసుకుంటూ... పిల్లలను కంటూ సంసార సుఖాన్ని... ఆనందాన్ని పంచుకుంటున్నారు. నువ్వో? అందుకు భిన్నం.' అవేశ పడ్డాను.

'మీకు తెల్సుగా నాట్యం నా ఆరోప్రాణమని! అందుకనేగా... ఏరి కోరి పెళ్లాడారు! ఇప్పుడు మీరేడ్చి నన్నేడిపిస్తే ఏం ప్రయోజనం?- 'నొసలు చిట్లించింది హర్ష.

'వాడు నీకు డప్పు వాయిస్తూంటే.. నువ్వేమో తమ్ముడికి వత్తా సాస్తూండు! ఇద్దరూ ఇద్దరే...'

'నేర్చుకున్న విద్యకు న్యాయం చేయకపోతే కళాకారిణిగ నేను బతికినా ఒకటే.. చచ్చినా ఒకటే...'

'అతిగా వాగకు! - అవునే... మన మేరేజ్ అయిన ఈ అయిదేళ్లలో నువ్వెంత సంపాదించి మూట కట్టేవే? - పళ్లు కొరుకుతూ ప్రశ్నించాను.

'ఆ వివరాలు మీకు దేనికండీ బావగారు? - మీరేం ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ కాదు కదా? - ఆంజనేయులు మాటల్లో వ్యంగ్యం వెటకారం చోటు చేసుకున్నాయ్.

'ఒరేయ్ బామ్మర్దీ... నీ పీక పిసికి చంపేస్తాను. నువ్ నోర్మూయ్..' గద్దించాను.

'బై ది బై ... బావగారూ...! మీ కో శుభవార్త... అక్కకు సినీమా చాన్స్ వచ్చింది మీకు చెప్పలేదా?

'అది ఏం చెప్పింది గనుక? మీ అక్క పలుకే బంగారం. మాట్లాడితే నోటిముత్యాలు రాలతయ్‌రా?

'విషయమేమిటంటే...'

'సోది ఆపు! హీరోయిన్‌గా పిక్చర్లో బుక్కయ్యిందా?...'

'నో నో నో ! కాదండీ... దర్శక నిర్మాతలు నాట్యపరమైన పిక్చర్ తీయనున్నారట. శాస్త్రీయ నాట్యం అక్కకు కొట్టిన పిండి అని తెల్సుకుని... డాన్స్ డైరక్టర్‌గా... కొరియో

గ్రాఫర్‌గా ఫిక్స్ చేసి నాలుగు లక్షలు ఎడ్వాన్స్ కూడా ఇచ్చారు. మొత్తం కాంట్రాక్ట్ పాతిక లక్షలకు ఖాయం చేసుకున్నాం...

'అంతా... అక్కా తమ్ముళ్ల ఇష్టమేనా? నా పర్మిషన్‌తో పన్లేదా? ఐడోంట్ టాలరేట్ దిస్...' పళ్లు నూరాను.

'డబ్బుంటే చేదా రాజేష్...' నవ్వుతూ అంది హర్ష.

'చూడు హర్షా! ఎంత కాలం మన మీ విధంగా ఒకరికొకరం దగ్గరవకుండా దూరం దూరంగా వుంటాం? చేసిన కళాసేవ చాలు! ఫుల్‌స్టాప్ పెట్టి భర్త సేవ ఆరంభించు! బిడ్డల తల్లివై నాకు ఆనందాన్ని పంచు..' నచ్చ చెప్ప ప్రయత్నించాను.

'అక్కా! బావగారి చక్కెర మాటలకు లొంగిపోయి.. ఛాన్స్ వదులు కుంటే మళ్లీ రాదు. నీ కెరీర్ స్పాయిల్ అవుతుంది. హిమాలయాలంత ఎత్తుకు ఎదగాలి నువ్వు. కీర్తి శిఖరాలను అధిరోహించాలి! ఇంటికే అంకితమై పిల్లలను కంటూ కూర్చుంటే నీ పేరు ప్రతిష్ఠలు... ఆదాయం చంకనాకి పోతుంది. బాగా ఆలోచించుకో! తర్వాత నీ ఇష్టం...'

'నువ్ నోర్మూయ్యరా అంజీ! నన్నాలోచించుకోనీ...' అక్కడ్నించి బెడ్‌రూమ్‌వైపు నడిచింది హర్ష.

పరిస్థితి గమనించిన ఆంజనేయులు వడివడిగ వీధిలోకెళ్లాడు.

హర్షకు కోపం వచ్చిందని అర్థం చేసుకోగలిగాను. సత్యభామ అలక తీర్చటానికి శ్రీకృష్ణుడు వెళ్లి కాలితో తన్నించుకోవటం వంటి సీను... నేను హర్ష బెడ్ రూమ్‌లోకి వెడితే ఎక్కడ దాపురిస్తుందోనే భయంతో సోఫాలోనే కూలబడి మేగజైన్ తిరిగేస్తూండిపోయాను.

★ ★ ★

పోర్టికోలో ఆగిన కారు దిగి బంగళాలోకి నడిచాను. నారాక గమనించి ఆయా కాఫీ తెచ్చి ఇచ్చింది.

'హర్ష ఇంట్లో వుందా? - 'కాఫీ సిప్ చేస్తూ ఆయాని అడిగారు.

'మేడ మీద బెడ్ రూమ్‌లో వున్నారయ్యా...'

అని చెప్పి కాళీ కప్పుతో లోనికి వెళ్లి పోయింది ఆయా.

హర్ష బెడ్‌రూమ్‌లోకి ఎంటరవుతూనే 'నాట్య మయూరి ఇంట్లోనే వున్నారే? వేరీ హేపీ! ఆర్‌యూ ఆల్‌రైట్..? అప్యాయంగా పలుకరించాను.

'కొంచెం నెర్వస్‌గా వుంది డియర్...'

'మంచి నర్సింగ్ హోంలో ఎడ్మిట్ కాకపోయావా?'

'ఏంటీ? వెటకారామా? దెప్పుళ్లా? - సీరియస్‌గా ముఖం పెట్టింది.

'భార్య భర్తలమైన మనవి ఉత్తర దక్షిణ ధృవాలైనాయ్. ఏం చేద్దాం? ఎవరి ఖర్మం వారిది (ఎవరి గోల వారిది సినిమా టైటిల్ లాగా?)

అనేసి 'ఛైర్లో' 'రిలాక్సై' రిమోట్ అందుకుని టి.వీ. ఆన్ చేశాను.

'టీ.వీ. కట్టేసి..నే చెప్పేది వినండి...'

'వేరీ ఇన్టరెస్టింగ్!...! నువ్వు నాతో ఏదో చెప్పాలనుకుంటున్నావా? అంత ఇంపార్టెంట్ విషయమా?.. చెప్పు చెప్పు చెప్పు...'

'నన్ను ఆట పట్టించటం మీకు సరదా? ...-' నవ్వింది.

'ఓకే.. పాయింట్‌కొచ్చేయ్...' టి.వీ. ఆఫ్ చేశాను.

'ఉదయం గైనకాలజిస్ట్‌ని కలిశాను'

'వావ్!... ఏమంది?... టెల్...టెల్...టెల్... శుభవార్త కదా?... ఎన్నో నెలని చెప్పింది డాక్టర్?--'టకటక వాగేను

'ఆపండి మీ గోల... ఏమిటీ మరీ చంటి పిల్లాడిలా..?'

'నీ బొజ్జలో బుజ్జిగాడు బైటి కొచ్చే దాకా నేన్నీకు చంటి పిల్లాడినే! - నీ కేంప్రజెంటేషన్ కావాలో చెప్పు! డైమాండ్ నక్లెసా? సింగపూర్ ప్లజర్ ట్రిప్పా?... మరో **తాజ్** మహల్ కట్టించనా? కానీ నేను షాజహాన్‌ని కాదే... హర్షాతిరేకంతో హర్ష బుగ్గ గిల్లాను.

'అబ్బా... నే చెప్పేది కాస్తంత ప్రశాంతంగా వినండి...'

మారు మాట్లాడకుండా నోటి మీద వేలేసుకుని... బుద్ధిమంతుడిలా సైలెంట్ అయ్యాను.

'ఈ రాత్రికి డిన్నర్ ఫైవ్‌స్టార్ హోటల్లో' ఠక్కున నోరు విప్పాను.

'ఎఫ్ ఎమ్ రేడియో స్టేషన్లా మీలొడలొడ కాస్త ఆపండి...'

'ఎగ్రీడ్!... చెప్పు'

'చెకప్ చేసిన గైనకాలజిస్ట్ నా డేట్ కన్ఫరమ్ చేసింది...'

ఇంకేం? వెరివెరీ హాపీసు...' దగ్గరై వాటేసుకుని ఓ తీయని 'కిస్సి'చ్చాను.

'సరసానికైనా వేళా పాళా వుండాలి?...'

'ఐ ఎడ్మైర్ యూ డియర్... లేటైనా నాకో అద్భుతమైన కానుక ఇవ్వబోతున్నావ్. నన్ను ఫాదర్‌ని చేస్తున్నందుకు...వేరీ మెనీ... థాంక్స్..' సంబరపడుతూ చెప్పటానికి మాటలు చాల్లేదు.

'అసలు విషయం వింటే మీ ఆనందం వుత్సాహం చప్పు చల్లారుతుంది...'

'అదేంటి?... అద్సరే.. నీకు ఎన్నో నెలట..? కాన్పు ఎప్పుడు కావచ్చని చెప్పింది డాక్టర్? పుట్టబోయేది అడపిల్లా... మగ పిల్లాడా...? హర్షకు వూపిరి సలపకుండా ప్రశ్నల వర్షం కురిపించాను తన్మయత్వంతో..

'స్పీడు ఆపండి మహాశయా!! నే చెప్పేది కాస్త విన్పించుకోండి! ఊహల ప్రపంచంలో విహరించకండి.. చిరాకు విసుగు చోటు చేసుకున్నయ్ హర్ష మాటల్లో.

'వాట్ వాట్ వాట్?' అంటూ కళ్లు పెద్దవి చేశాను.

'సారీ డియర్... నిన్ను తండ్రిని చేయలేక పోయాను. నన్ను మన్నించు...' అంది మెల్లగ.

'ఏంటి? జోకా? - ' నెత్తిన మెత్తటి మొట్టికాయ వేశాను.

'కాదు. ఫాక్ట్!'

'అదేంటి?...' విస్తుపోయాను. షాక్‌కి గురయ్యాను.

'నా ఫారిన్ ట్రిప్ దగ్గర పడుతోంది కదా? అప్పటికి అయిదో నెల గర్భిణీనై వుంటాను కదా... విదేశాల్లో నాట్య ప్రదర్శనెలా ఇవ్వగలను? ఇంపాజిబుల్? .. అందుకే అబార్షన్ చేయించుకొచ్చాను.

హర్ష చావు కబురు చల్లగా చెప్పింది. ఆమె మాటలకి మ్రాన్పడ్డాను. నే వింటున్నది అబద్ధం కాదు కదా అన్పించింది.

నాలో కోపం ఆవేశం ఉవ్వెత్తున సునామీ కెరటాల్లా లేచాయి! కోపం కట్టలు తెంచుకుంది.

'రాస్కెల్! గర్భం పోగొట్టుకునే అధికారం నీకెక్కడిది?ఎవరిచ్చారు? నాతో కన్సల్ట్ చేయకనే డర్టీ నిర్ణయం నీకు నువ్వే తీసుకున్నావా? నాతో విషయం'డిస్కస్' చేయాలన్పించ లేదా? కడుపులో ఊపిరి పోసుకుంటున్న పిండాన్ని.... పసిగుడ్డును... నిర్దయగ.. నిర్లజ్జగ చంపేసి హంతకురాలివైనావా? - కడుపులో బిడ్డకంటే.. నీకు డాన్స్

ప్రోగ్రాము... ఫారిన్ ట్రిప్పే ఎక్కువన్పించిందా?... ఉద్రేకాన్నిఆపలేక హర్ష రెండు చెంపలు వాయించాను.

'రాజేష్ స్టాప్ దిస్ నాన్సెన్స్ ఐహేట్ యువర్ అటిట్యూడ్! భార్యనైనంత మాత్రాన నన్ను కొడతావా? హింసిస్తావా?... అవేశపడి మాట్లాడుతూ దూరంగా జరిగింది హర్ష తనను తాను రక్షించుకోవాలనే ప్రయత్నంలో.

'ఎంతటి రాక్షసివే నువ్వు? నవ్వసలు ఆడదానివేకాదు. నీలో తల్లి మనసు లేదు. బిడ్డ పట్ల మమతాను రాగాలునీలో కరువైనయ్. నువ్వింత నీచమైన హేయమైన పనికి ఒడిగడతావని వూహించనైనా లేదు. - పెళ్లి అయిన ప్రతి స్త్రీ తల్లి కావాలని కోరుకుంటుంది. ఆరాటపడుతుంది. ఆడదానికి మాతృత్వం ఒక వరం! మాతృత్వంలోని తియ్యదనాన్ని.. ఆనందాన్నీ అనుబఖీవించలేక పోయిన మూర్ఖురాలివి నువ్వు. అట్లాంటిది... నాతో సంప్రదించకుండా నీకు నీవే నిర్ణయిం తీసుకుని నన్నూ నా ఆశలను మొక్కలోనే తుంచేశావుకదే పాపిష్ఠిదానా? - నీలాంటి ఆడదాన్ని ఈ ప్రపంచంలో ఎక్కడా చూడలేం! - నీలో మానవత్వం లేదు. మాతృత్వాన్నే కాదనుకున్నావ్!... నువ్వసలు మనిషివే కాదు.. నన్ను దగాచేశావ్... - వెళ్లు.. వెళ్ళిపో... ఐడోన్ట్ లైక్‌యు... ఐ హేట్‌యు...!.. గదిలోంచి హర్షను ఆవేశంతో గెంటేసి తలుపులు మూసుకుని ఒంటరిగా కూర్చుని తనివితీరా విలపించాను.

హర్ష ముఖం ఇక ముందెన్నడూ చూడకూడదనే నిర్ణయాని కొచ్చిన నేను గుండెలవిసేలా ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి బెడ్ మీద వాలిపోయాను.

*(అభ్యుదయ ఫౌండేషన్ కాకినాడ వారు నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)*